


# వయసు

రుద్రాభట్ల నరసింగరావు

ప్రభాకరశాస్త్రి ఒక దినపత్రిక దొరకని వూళ్ళో వుద్యోగం చేస్తున్నాడు వారపత్రిక సరిగా దొరకని దగ్గరలో ఉన్న ఒక చిన్న పట్నంలో వారాంతాలు గడిపి వొస్తుంటాడు వారాంతాలు అంటే అక్షరాలా వారాంతాలు కాదు శని ఆది వారాలలో ఏదో ఒక పూట. అయినా గొప్ప కోసం వీటిని వారాంతలనే అందాం.

అతను అక్కడినుండి తెచ్చుకునే నిధి నిక్షేపాలలో 'బ్లిట్జ్' ఒకటి అదీ వెళ్ళినప్పుడల్లాకాదు .ఎంచేతంటే అది రావలసిన రోజు అయిన శనివారం వెళితే ఒక్కొక్కప్పుడది రాకపోవచ్చు ఆదివారం వెళితే ఉండకపోవొచ్చు పోనీ అని తనకొక ప్రతి తప్పకుండా ఉంచమందామా అంటే ఏ వారం వెళ్ళేదీ ఏ వారం వెళ్ళనిదీ తనకే తెలియదు

విలాసవొస్తువులని కొనుక్కునే సరదాతో తనకి అవసరమయే వొస్తువులనే కొనుక్కోవడం, చల్లారని ఫలహారం, చక్కని వాసనవొచ్చే కాఫీ, ఒకటి రెండు రికార్డులు, నలుగురైదుగురు తనని చూడకపోయినా తనకి కనిపించే హైస్కూలు అమ్మాయిలూ ఇలాటివేవో ఈ వారాంతపు

అనంత ఆనందాలలో భాగం అవుతాయి.

నాలుగు గోడలమధ్య జీవితానికి కొంత సేపు స్వస్తి చెప్పేంకదా అన్న హాయి ఒకటి తోడవుతుంది వీటికి.

అంచేత 20 మైళ్ళ సైకిలు ప్రయాణాన్ని ఎంత కష్టమైనా చేసి తీరుతాడు. తారురోడ్డు, గతుకులరోడ్డూగాక చిన్న సిమెంటు రోడ్డుముక్క కూడా తగులుతుంది అతని ఈ ప్రయాణంలో.

ఒకసారి___

పోను పదిమైళ్ళూ రాను ఆరుమైళ్లూ ప్రయాణంచేసి తిరిగి తన వూరికి తిన్నగా వెళ్ళే గొప్ప తారురోడ్డుని ఎక్కి, మార్గాయాసాన్ని పోగొట్టుకోవడానికి ఏ చెట్టు కిందో ఆగే పూర్వకాలపు యాత్రీకులని అనుకరిస్తూ సైకిలు ఆపి స్టేండువేసి తూముమీద చతికిలబడ్డాడు ప్రభాకరశాస్త్రి.

కలుసుకుందా మనుకున్న మిత్రుడు కనబడకపోవడం, కలుసుకోవడం ఇష్టం లేని పరిచయస్థులు తారసపడి ఒకంతట ఒదలకపోవడం బ్రిడ్జ్ లేకపోవటం, డబ్బు చాలకపోవటం, లాటివి అతన్ని చాలా క్రుంగదీసేయి

ఇంకా పొద్దు వాటారలేదు. చుట్టూ విశాలమైన పొలాలు. కాస్త దూరంగా కొండలు ఇక్కడే ఇలాగే గడిపేద్దా మన్నంత అలసటగానూ వుంది, అక్కడ హాయిగా వుంది.

దగ్గరలో మేకల్ని మేపుకుంటున్న ఒక ముసలతను వొచ్చేడు "అగ్గుందా బాబూ" అనడిగేడు.

"లేదు" అన్నాడు శాస్త్రి.

సిగరెట్లు కాల్చడీ అబ్బాయి అని తెలిసి సద్భావం కలిగికాబోలు అతను మెల్లిగా వొచ్చి తూముమీద కొంచెం దూరంలో కూర్చున్నాడు.

మాట్లాడే మనిషి దొరకని వాడిలా వున్నాడు

శాస్త్రి జీవితానికీ అతని జీవితానికీఉన్న తేడా అల్లా శాస్త్రితో పుస్తకాలయినా మాట్లాడతాయి.

ఏ వూ రె ళ్ళా లి? ఏంపని? ఎంత వొస్తుంది? పెళ్ళయిందా?___ప్రశ్నావళికి జవాబు లిచ్చేడు శాస్త్రి.

రోడ్డుకి మైలుదూరంలో ఉన్న ఊరు అతనిది

"మా వూళ్ళో మీ కులపాయనే ఒక మోతుబరి ఉన్నాడు " అంటూ సంభాషణ సాగించేడు ముసలతను

ఇన్నెరకాలున్నాయి, ఇన్ని పశువులున్నాయి అంటూ చెప్పసాగేడు

ఎన్ని పశువులుంటే-ఈ ప్రాంతంలో ఎన్నిఎకరాలుంటే ఎంతధనవంతుడో తెలియదు శాస్త్రికి కాబట్టి అదొకలావిన్నాడు

" ఇల్లూ, బోలెడు బంగారం "

ఆయనకి ఆడపిల్లగాని వుందని చెబుతాడేమో అనుకున్నాడు శాస్త్రి.

"ఓ ముండ వుంది." అన్నాడు ముసలతను బూడిదరంగు కళ్ళతో శాస్త్రివైపు ఆసక్తిగా చూస్తూ

నవ్వేసి వూరుకున్నాడు శాస్త్రి.


"ఇప్పటికీ మంచి పొగరుంది."

జవసత్వాలున్నాయని అతని అభిప్రాయం ఈ కాస్త సైకిలు ప్రయాణం చెయ్యలేక విశ్రాంతి తీసుకుంటున్న తన మీద జాలిపడి చెబుతున్నది ఆ ఆసామీ ఉదంతం అని శాస్త్రికి తెలుసు.

## సుభాషితాలు

ఇతరుల దుఃఖాలను చూసి బాధపడే వ్యక్తికంటే, నా దృష్టిలో గొప్పవాడు ఎవడూ లేడు.

—ప్రేమ్‌చంద్




మాటల మధ్యలో తన వయస్సెంత ఉంటుందని అడిగేడు ముసలతను.

దేవతలకి వయస్సు పెరగదన్న విషయం, స్త్రీల వయస్సుమీద ఉన్న హాస్యోక్తులూ- సినీమా తారలకీ వయస్సుకీఉన్న అవినాభావ సంబంధం, లోక వ్యవహారంలో వయస్సు కాస్త తగ్గించనిదే కుదరని సందర్భాలూ, మీ వయస్సు తగ్గించి చెబితే మీరు సంతోషిస్తారనే మనస్తత్వశాస్త్ర విషయంలాటివి ఎన్నో తెలిపిన శాస్త్రి "ఏభయ్యయిదో అరో వుండొచ్చు " అన్నాడు.

"అంతే?" అనడిగేడు ముసలతను.

"అంతే. అంతకన్న ఎక్కువ వున్నట్టు ఎక్కడా కనిపించవు." అన్నాడు శాస్త్రి ధైర్యం చెబుతున్నట్టు

"జాగ్రత్తగా చూసి నిజం చెప్పు బాబూ!"

అతని ఆశ ఏమిటో శాస్త్రికి బోధపడ లేదు కాస్త ఎక్కువఏళ్ళు ఉంటాయేమో చూడమన్నది అతని ఉద్దేశం అన్నట్టు గ్రహించేడు శాస్త్రి

ఇతను చెప్పలేకపోవడం చూసి ఒక ఆధారం ఇస్తున్నట్టు అన్నాడు ముసలతను.

"కాగితం ఎరగను నేను "

కరువువల్ల కాగితం ఎరగకపోవడం శాస్త్రి పుట్టేక చాలాసార్లే జరిగింది. అది కాదు మరి. కాగితం ఎరగకపోవడం అంటే అసలు ఎరగక పోవడమే

కాగితం, అచ్చుయంత్రం మొదలయిన వాటి పుట్టు పూర్వోత్తరాలు శాస్త్రి బాగానే

ఎరుగును. కాని ఈ ప్రాంతపు పల్లె ప్రజలు ఎంతకాలం కిందటిదాకా కాగితం ఎరగరో అతనికి తెలియదు

"చాలా వుంటుంది నా వయస్సు ఏం?" అన్నాడు ముసలతను కొంత సేపటికి

"అవును " అన్నాడు శాస్త్రి.

"ఇంత వయస్సు వొచ్చినా ఇంకా నేను పనిచెయ్యాలి." అన్నాడతను

అతని బాధ ఇప్పటికి అర్థమైంది శాస్త్రికి.

"చేతికందిన కొడుకులు లేరూ?"

"ఉన్నారు. కాని బూకరిగాళ్ళు బాబూ!"

నోరున్న వాళ్ళని.

"సరిగా చూడరన్నమాట?"

"ఉఁహుఁ" అంటూ తన వాళ్ళని అసహ్యించుకున్నట్టు అడ్డంగ ఆడించేడు ముసలతను

శాస్త్రి సానుభూతితో కొంతసేపు ఏదో మాట్లాడేడు

సైకిలుమీద తనని శాస్త్రి వూరు తీసుకు వెడతాడా అనడిగేడు ముసలతను. శక్తిలేకపోయినా "తీసుకు వెడతాను." అన్నాడు శాస్త్రి "వొస్తావా?" అని నవ్వుతూ స్నేహపూర్వకంగా అడిగేడు.

"వొద్దుబాబూ. నవ్వులాటకన్నాను " అన్నాడు ముసలతను నవ్వుతూ. ఇందాక తీసుకువెడతావా అని అడిగినప్పుడూ నవ్వు దాచుకుంటూనే అడిగేడని ఇప్పుడు తెలిసింది

ఇంకా ఆ ముసలతనిలో ఎదటివాడిలో మంచి అనేది ఉందో లేదో పరీక్షిద్దామన్న ఆసక్తైనా మిగిలివుంది అనుకుని సంతోషించేడు శాస్త్రి.

ఒక పావలా ఇవ్వబోయేడు

"వొద్దు బాబూ?" అన్నాడు ముసలతను డబ్బుని అసహ్యించుకుంటున్నట్టు మొహంపెట్టి తల తిప్పేసి

"నా కొడుకులు అలా వున్నారని నీకెందుకు నా గురించి బాధ?" అనికాబోలు.

లేచి సైకిలు తీసేడు శాస్త్రి.

"పొద్దుపోతుంది కాస్త జోరుగా లాగించు" అని హెచ్చరించేడు ముసలతను

కర్రను నేలమీద కొడుతూ మేకల వెంట పడ్డాడు

వయస్సు ఎక్కువ చెప్పమని ఆశించిన వ్యక్తి కనబడడం ఆనాడు శాస్త్రికి ఒక అనుభవం

పట్నంలో పొందిన ఆశాభంగాల కిది కొంత కూడి రావడంగా పనికొచ్చింది

ఇన్ని పుస్తకాలు చదివేడుగదా, ఇలాటివి ఎక్కడా చూడలేదు తను. అనుకుంటూ సైకిలు తొక్కుతున్నాడు శాస్త్రి.

ఆఁ చిన్న పిల్లల్ని రెండో పెళ్ళి వాళ్ళకి కట్టబెట్టే సందర్భాలలో బెంగాలులోని ప్రజలు ఆడపిల్లల వయిస్సు చాలా ఎక్కువ చెబుతారు అని శరత్‌బాబు రాసేడుగదా అంతేకాదు శరత్‌బాబు నిర్భాగ్య నాయికలందరూ తమ వయస్సు ఎక్కువనే చెప్పుకుంటారు

ఇతని కారణం వేరు కావొచ్చు

సూర్యాస్తమయం అవుతూండగా వూరు చేరాడు శాస్త్రి.

కిళ్ళీకొట్టుదగ్గర సైకిలు అప్పగించి సోడాతాగి కొంచెం కాళ్ళు తేలిపోతూంటే గదికి బయలుదేరేడు తన విశేషాల సంచీతో. □□